క్లుప్తంగా

రోస్టర్ రిజిస్టర్ల తనిఖీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ రిక్రూట్‌మెంట్ సెల్‌లో బుధవారం రోస్టర్ రిజిస్టర్‌ను ఎస్సీ లైజన్ సెల్ ఆఫీసర్లు తనిఖీ చేశారు. సింగరేణిలో ఇటీవల జరిగిన ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ రిక్రూట్‌మెంట్లలో ఎస్సీల రిక్రూట్‌మెంట్ రోస్టర్ ప్రకారం జరిగిందా లేదా అని పరిశీలించారు. జీఎం నికోలస్ మాట్లాడుతూ.. అంతా సక్రమంగానే జరిగిందని చెప్పారు. లైజన్ ఆఫీసర్లు దుర్గం రాంచందర్, మాల కొండయ్య, రాజేశ్వర్, వెంకటేశ్వరరావు, ఆంతోటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పిట్ సెక్రటరీగా శ్రీనివాస్



నియామకపత్రం అందజేస్తున్న మల్లికార్జున్‌రావు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా సివిల్ డిపార్ట్‌మెంట్ పిట్ సెక్రటరీగా ఏఐటీయూసీకి చెందిన సందెబోయిన శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు ఆ యూనియన్ బ్రాంచి కార్యదర్శి వట్టికొండ మల్లికార్జున్‌రావు బుధవారం ఏరియా ఏజీఎం సివిల్ రామకృష్ణకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సందెబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ.. యూనియన్ తనపై నమ్మకంతో పిట్ సెక్రటరీగా నియమించిందని, సివిల్ డిపార్ట్‌మెంట్‌లోని కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జి.అప్పారావు, వెంకటేశ్వర్లు, టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్కౌట్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్‌గా రమేష్

పాల్వంచరూరల్: దంతలబోరు ఎస్సీ కాలనీకి చెందిన గద్దల రమేష్‌ను భద్రాద్రి జిల్లా స్కౌట్ ఆర్గనైజింగ్ కమిషనర్‌గా నియమించారు. నేషనల్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు తెలంగాణ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

బాధ్యతలు చేపట్టిన ఇన్‌చార్జ్ ఎఫ్‌ఆర్‌ఓలు

ఇల్లెందురూరల్: అటవీశాఖ విజిలెన్స్ విభాగం ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్ ఇంతకాలం ఇల్లెందు ఎఫ్‌ఆర్‌ఓగా అదనపు బాధ్యతల్లో కొనసాగారు. ప్రస్తుతం ఎఫ్‌డీఓగా పదోన్నతి పొంది మంచిర్యాల జిల్లాలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇల్లెందు ఇన్‌చార్జ్ ఎఫ్‌ఆర్‌ఓగా కాచనపల్లి ఎఫ్‌ఆర్‌ఓ చలపతికి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు కొమరారం ఎఫ్‌ఆర్‌ఓగా అదనపు బాధ్యతల్లో కొనసాగిన కాచనపల్లి ఎఫ్‌ఆర్‌ఓను ఇల్లెందుకు ఇన్‌చార్జ్‌గా నియమించడంతో అక్కడ ఇన్‌చార్జ్‌గా గుండాల ఎఫ్‌ఆర్‌ఓ నరసింహారావును నియమించారు. ఈ మేరకు ఇద్దరూ బుధవారం బాధ్యతలు చేపట్టారు.

యూనిఫామ్ పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో పరిశుభ్రతను పాటించేలా, చెట్లను సంరక్షించేలా ప్రత్యేక కార్మికులను ప్రభుత్వం ఇటీవల నియమించింది. వారికి బుధవారం ఎంఈఓ ప్రభుదయాళ్ యూనిఫామ్ అందజేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో వీరు పని చేస్తారని తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీ

ఇల్లెందు: మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్త మీద విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. బుధవారం ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకుషావలీ మాట్లాడుతూ.. పట్టణాలు పరిశుభ్రంగా ఉంచుకోవటం కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హోమ్ కంపోస్టింగ్, ప్లాస్టిక్ తదితర నిషేధిత వస్తువులు వాడకుండా ఆయా అంశాలపై విద్యార్థులకు వివరించారు.

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

జూలూరుపాడు: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బీఆర్‌ఎస్ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. ఇళ్లు లేని వారికి, రేకుల షెడ్లు, పూరిగుడిసెల్లో నివసించే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుండా ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు అనుకూలంగా ఉన్న వారికి ఇళ్లు ఇవ్వడం ఏమిటనీ ప్రశ్నించారు. అర్హులైన పేదలను పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంజూరైన ఇళ్లకు సంబంధితశాఖ ఏఈ సమక్షంలో మార్కింగ్ ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు రాకకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు.

విద్యుత్ అధికారులకు కొత్త నంబర్లు

పాల్వంచరూరల్: మండలంలో విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న మారిన అధికారుల ఫోన్ నంబర్లు

రవీందర్, రూరల్ ఏఈ	- 8712485966
కోటేశ్వరరావు, లైన్ ఇన్‌స్పెక్టర్	8712485967
కె.వెంకటేశ్వర్లు, ఎల్‌ఐ	- 8712485968
ఎస్.ఆర్.కె. మూర్తి, ఎల్‌ఐ	- 8712485969
అబ్దుల్ అజీజ్ ఖాన్, ఎల్‌ఎం	8712485970
జగన్నాథపురం, సబ్‌స్టేషన్	- 8712485971
యానంబైల్, సబ్‌స్టేషన్	- 8712485972
నాగారం, సబ్‌స్టేషన్	- 8712485973

నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడు?

- విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

జూలూరుపాడు: రేగళ్లతండా, వెనకతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నూతన భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. ఆయా పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకోగా, మాచినేనిపేటతండా ప్రాథమిక పాఠశాల భవనం మరమ్మతులకు గురైంది. రాష్ట్ర ప్రభుత్వం అమ్మ – ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద రేగళ్లతండా, వెనకతండా పాఠశాలలకు నూతన భవనాలకు రూ.32 లక్షలు, మాచినేనిపేటతండా పాఠశాల భవనం మరమ్మతులకు రూ.4.50 లక్షలు నిధులు మంజూరు చేసింది. రేగళ్లతండాలో ఐదు నెలల క్రితం భవన నిర్మాణ పనులు ప్రారంభం కాగా, వెనకతండాలో మూడు నెలల క్రితం ప్రారంభమయ్యాయి. ఈ రెండు పాఠశాలల భవనాల పనులు సన్‌సైడ్‌లెవల్ పూర్తి కాగా, మాచినేనిపేటతండా పాఠశాల భవన మరమ్మతులు పూర్తి చేసినప్పటికీ పెయింటింగ్ వేయాల్సి ఉంది. పాఠశాల భవనాలు జూలై చివరి వరకు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నప్పటికీ పనులు మాత్రం నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇప్పుడప్పుడే అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదు. దీంతో విద్యార్థులకు ఈ ఏడాది కూడా తిప్పలు తప్పేలా లేవు. ప్రస్తుతం రేగళ్లతండా పాఠశాల రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే రేకుల షెడ్డులోనూ, లేకపోతే చెట్ల కింద విద్యార్థులను కూర్చోబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు. ఇక్కడ పరిస్థితి ఇలా ఉంటే వెనకతండాలో శిథిలావస్థ భవనంలోనే పాఠాలు చెబుతున్నారు. స్లాబ్ పెచ్చులు ఊడిపడుతుండటం, వర్షానికి కురవడంతో గదులు తడిసిపోయి విద్యార్థులు కూర్చోనే పరిస్థితి లేదు. దీంతో వర్షం వచ్చిన రోజు పాఠశాలకు సెలవు ప్రకటించాల్సిన దయనీయ పరిస్థితి. ఇదే పాఠశాల భవనంలో అంగన్‌వాడీ కేంద్రం కూడా నడుస్తోంది. అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం నడుస్తుండటంతో ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆందోళనకు గురవుతున్నారు. ఏ ప్రమాదం ఎప్పుడు ముంచుకొస్తోందని భయాందోళనకు గురవుతున్నారు. మండలంలో 55 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ప్రాథమిక పాఠశాలలు 37, గిరిజన ప్రాథమిక పాఠశాలలు 6, యూపీఎస్‌లు 5, హైస్కూల్స్ 5, కేజీబీవీ-1, ఏజీహెచ్‌ఎస్-1 ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం, పాఠశాల విద్యను అభివృద్ధి పరిచేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మన ఊరు – మన బడి కార్యక్రమం కింద 17 పాఠశాలలను అభివృద్ధి పరచగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ– ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో కింద గత ఏడాది 25 పాఠశాలలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి పరిచింది. అయితే ఈ ఏడాది అమ్మ – ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద వెనకతండా, రేగళ్లతండా పాఠశాలలకు కొత్త భవనాలకు, మాచినేనిపేటతండా పాఠశాల భవనం మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. పాఠశాల కొత్త భవనాలను జూన్ నాటికి కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

సంబంధిత అధికారుల పర్యవేక్షణాలోపం కారణంగానే సకాలంలో పనులు పూర్తి కావడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పాఠశాలల భవనాలను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



రేగళ్లతండాలో సన్‌సైడ్ దశలో ఉన్న పాఠశాల భవనం



వెనకతండాలో శిథిల భవనంలో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



రేగళ్లతండాలో చెట్టు కింద విద్యాబోధన చేస్తున్న టీచర్

పాఠశాల భవనం పూర్తి చేయాలి..



పాఠశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. ప్రస్తుతం పాత భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నాం. శిథిలావస్థ భవనం కావడంతో స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. వర్షం వస్తే పాఠశాలకు సెలవు ప్రకటించాల్సి వస్తోంది.

– బి.ఏడుకొండలు, ఉపాధ్యాయుడు, వెనకతండా

చర్యలు తీసుకుంటున్నాం..



రేగళ్లతండా, వెనకతండా పాఠశాలల భవన నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. సంబంధితశాఖ అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పర్యవేక్షిస్తున్నాం. నూతన పాఠశాల భవనాలు జూలై చివరికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మాచినేనిపేటతండా పాఠశాల భవనానికి మరమ్మతులు పూర్తయ్యాయి.

– బానోత్ జుంకీలాల్, ఎంఈఓ, జూలూరుపాడు

‘సీతారామ’ నీళ్లు అందించండి..

జూలూరుపాడు: జూలూరుపాడు మండలంలో ప్రతీ ఎకరానికి సీతారామ ప్రాజెక్టు నీళ్లు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జూలూరుపాడు పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. సీతారామ మెయిన్ కెనాల్‌కు చెరువులను అనుసంధానం చేసి పిల్లకాలువల ద్వారా మండలంలోని సాగుభూములకు నీరు అందించి సస్యశ్యామలం చేయాలన్నారు. సీతారామ నీటిని రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా ఖమ్మం జిల్లాకు తరలించడం నిలిపివేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఎన్నికల హామీలను అమలు చేయకుంటే స్థానిక సంస్థల్లో గెలవనివ్వబోమన్నారు. యాసా నరేష్, గార్లపాటి వెంకటి, వల్లమల్ల చందర్‌రావు, పద్దం సుగుణ, గడిదేశి కనకరత్నం, ఊడల వెంకటేశ్వర్లు, గోవిందు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక



హైస్కూల్‌లో పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం బుధవారం జూలూరుపాడు హైస్కూల్‌లో మండల స్థాయిలో విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహించారు. 2025–2026 విద్యా సంవత్సరానికి 4వ తరగతి ప్రవేశానికి విద్యార్థినీ, విద్యార్థులను ఎంపిక చేసేందుకు పలు క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు చెందిన 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎత్తు, బరువు, స్టాండింగ్, బ్రాడ్ జంప్, 30 మీటర్ల ఫ్లయింగ్, 10 గీ 6 మీటర్లు, మెడిసిన్ బాల్, 800 మీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించారు. 10 మంది బాలురు, 10 మంది బాలికలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని, ఈనెల 26, 27వ తేదీల్లో కొత్తగూడెంలో జిల్లా స్థాయి పోటీలు జరగనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ తెలిపారు.

సేవాభావంతో పనిచేయాలి

పాల్వంచరూరల్: గ్రామ సంఘాల పదాధికారులు (ఆఫీస్ బేరర్లు) సేవాభావంతో పనిచేయాలని, సంఘానికి సంబంధించిన ప్రతీ విషయాన్ని మీటింగ్ మినిట్స్‌లో నమోదు చేసి పూర్తి పారదర్శకంగా పనిచేయాలని అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సుభాష్ అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సంఘాల పదాధికారులకు మూడురోజుల పాటు కిన్నెర మండల సమాఖ్య ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాంబాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రోజా, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు రవి, శ్రీను, మురళి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

టీయూసీఐ మహాసభను జయప్రదం చేయండి



సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ ఏరియాలో ప్రచారం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 21, 22 తేదీలలో నిజామాబాద్‌లో జరగనున్న టీయూసీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి పి.సతీష్ కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. బుధవారం కార్పొరేట్‌లోని వివిధ డిపార్ట్‌మెంట్లలో ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలతో కొట్లాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మికులను కట్టుబానిసలుగా చేసేందుకు పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తోందని ఆరోపించారు. దీనిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. గోపాలరావు, నాగలక్ష్మి, కృష్ణ, చంద్రకళ, నరసింహా, సునీత, భాగ్య పాల్గొన్నారు.

జూలూరుపాడు: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరగనున్న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) ప్రథమ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు, తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదులాపురం గోపాల్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం జూలూరుపాడులో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీపీ కార్మికులతో కలిసి మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. టీయూసీఐ ఆధ్వర్యంలో అన్నిరంగాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తోందన్నారు. ధన్వంతరావు, ఈర్యా, వినోద్, లక్ష్మి, రజనీ, విజయ, మురళీ, నవీన్, ముత్తయ్య పాల్గొన్నారు.

టేకులపల్లి: నిజామాబాద్‌లో జరగనున్న టీయూసీఐ తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఆ యూనియన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకుడు జరుపుల సుందర్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నిరకాల కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికుల కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు ఆలయ భూమి సాగుకు వేలంపాట

పాల్వంచరూరల్: పాతపాల్వంచలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన చింతల చెరువు ఆయకట్టు 2.30 ఎకరాల మాగాణి భూమిని వానాకాలం పంట సేద్యం కోసం ఈనెల 20వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆలయం వద్ద బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు రూ.5000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

తాగునీటి వ్యవస్థ పనితీరు తనిఖీ

ఇల్లెందురూరల్: మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సరఫరా తీరును పలు గ్రామాలలో సీఈ శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. గ్రామాలలో ఇంటింటి పంపు కనెక్షన్ల వివరాలు సేకరించి పలు గృహాలలో తాగునీటి సరఫరా తీరును తనిఖీ చేశారు.

నీటి సరఫరా గురించి గృహ యజమానులను అడిగి తెలుసుకున్నారు. సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో రోడ్డు వెడల్పు పనులలో భాగంగా మిషన్ భగీరథ పైపులు తొలగించాల్సిన ప్రాంతాన్ని, నూతనంగా పైపులు వేసేందుకు అనువుగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. మాట్లాడుతూ.. గ్రామాలలో తాగునీటి వ్యవస్థను పరిశీలించేందుకు తనిఖీలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈ శేఖర్, ఈఈలు నళిని, తిరుమలేష్, డీఈ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీగడపకు సంక్షేమ పథకాలు అందిస్తాం..



కారెగట్టులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచరూరల్: ఏజెన్సీలోని ప్రతీ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కారెగట్టు, మొండికట్ట, ప్రభాత్‌నగర్, పాండురంగాపురం, సూరారం, సోములగూడెం గ్రామపంచాయతీలో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. రూ.1.46 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రెయినేజీలను ప్రారంభించారు. తాగునీటి పథకాలకు శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ... రాష్ట్రంలోనే కొత్తగూడెం నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రతీ చిన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మరింత అభివృద్ధి చేసేందుకు శ్రమిస్తానన్నారు. సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ డీఈ రామకృష్ణ, విద్యుత్‌శాఖ ఏడీఈ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబా, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, నాగరాజు, అప్పారావు, ఉండ్రాతి రవి, వీర మోహన్‌రావు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ కోర్టుకు శంకుస్థాపన

మున్సిపాలిటీ పరిధి శ్రీనివాసకాలనీ మినీ స్టేడియంలో బుధవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఒలింపిక్ రన్‌ను ప్రారంభించారు. అనంతరం నూతనంగా నిర్మాణం చేయనున్న మూడు షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీవైఅండ్‌ఎస్‌ఓ పద్మారెడ్డి, ఒలింపిక్ జిల్లా అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ గ్రామసభలు

ఇల్లెందురూరల్: అర్హులైన రైతులకు పట్టాలు మంజూరు చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలు మండలంలో బుధవారం ముగిశాయి. బుధవారం విజయలక్ష్మీనగర్, తిలక్‌నగర్ గ్రామపంచాయతీలలో గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలలో నిర్వహించిన గ్రామసభలలో దరఖాస్తులు ఇవ్వలేకపోయిన వారి నుంచి తహసీల్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించామని చెప్పారు. ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్ చేసి పరిశీలన ప్రారంభిస్తామని తెలిపారు.

రేపటి నుంచి గ్రామసభలు...

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై మండలంలోని ఐదు గ్రామపంచాయతీలలో పరిశీలించేందుకు శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ధన్‌సింగ్ బుధవారం తెలిపారు. 20న మామిడిగుండాల, 23న వేములవాడ, ఆంజనేయపురం, బిచ్చతండా, 24న ఒడ్డుగూడెం, 25న రాఘబోయినగూడెంలో గ్రామసభలు ఉంటాయని తెలిపారు. గ్రామసభలలో ఎంపీడీఓ, తహసీల్దార్, ఏఓ, ఏపీఎం, వైద్యాధికారి, ఎంఈఓ, వివిధ శాఖల ఏఈలు హాజరై కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతీరును పరిశీలిస్తారని వివరించారు.

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోండి..




బిల్లుడుతండాలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి ఆశీర్వదిస్తున్న సీడీపీఓ, సూపర్‌వైజర్

టేకులపల్లి: ఐదేళ్లలోపు చిన్నారులు, తల్లులు, గర్భిణులకు ఉపయోగపడే అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార అన్నారు. బుధవారం అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా టేకులపల్లి, బోడు, సులానగర్, బొమ్మనపల్లి, గంగారం సెక్టార్లలో సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బొమ్మనపల్లి సెక్టార్ బిల్లుడుతండాలో ర్యాలీ నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్చుకుంటామని, ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను గవర్నమెంట్ స్కూల్‌లో చేర్పిస్తామన్నారు. మండలంలో జరిగిన అంగన్‌వాడీ బాట కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు అనురాధ, ఖలీదా, లక్ష్మి, యశోదమ్మ, నిర్మల పాల్గొన్నారు.

సుజాతనగర్: అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్‌కు పునాది అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.

వేపలగడ్డ గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే కూనంనేని సందర్శించారు. ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న చిన్నారులకు పట్టాలు, కిషోర బాలికలకు చిక్కీ పంపిణీ చేసి, చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ పద్మశ్రీ, సూపర్‌వైజర్ వెంకటరమణ, ఎంపీఓ శ్రీనివాస్, ఆర్ఐ.వీరభద్రం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కృత్రిమ మేధపై విద్యార్థులకు శిక్షణ



విద్యార్థికి ఏఐపై అవగాహన కల్పిస్తున్న నాగరాజశేఖర్

పాల్వంచరూరల్: ప్రభుత్వ బడులలో సాంకేతిక (కృత్రిమ మేధ) విద్యా విధానం ద్వారా విద్యపట్ల ఆసక్తిని పెంపొందించే విధంగా ప్రోత్సహించడమే కృత్రి మేధ లక్ష్యం అని మండల విద్యాశాఖాధికారి శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని బిక్కుతండా, సంగం గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, (ఏఐ) కృత్రిమేధపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా మానిటరింగ్ ఆఫీసర్ ఎ.నాగరాజశేఖర్‌తో కలిసి ఎంఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శైలజ, ఆశ్లేష పాల్గొన్నారు.

సీపీఐ మహాసభ సన్నాహక సమావేశం

ఇల్లెందు: ఏరియా సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 29న సీపీఐ పట్టణ మహాసభ జరుగుతుందని నిర్ణయించిన డెలిగేట్‌లు తప్పకుండా హాజరు కావాలని సీపీఐ రాష్ట్ర సమితి నాయకుడు మిర్యాల రంగయ్య కోరారు. బుధవారం ఇల్లెందులోని విఠల్‌రావు భవన్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లకోసారి మహాసభలు జరుగుతుంటాయని, రాబోయే మూడేళ్ల కార్యాచరణను ప్రకటించటం జరుగుతుందన్నారు. అధికార పక్షంతో మిత్రపక్షంగా ఉన్నప్పటికీ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం సాగుతుందని చెప్పారు. కె.సారయ్య, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, హరీష్‌గౌడ్, బాస శ్రీనివాస్, రవీందర్, బి.కొమురయ్య, సదానందం, చంద్రకళ పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సాయన పేట

- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- పని చేయని బోర్లు
- ఇష్టారాజ్యంగా మిషన్ భగీరథ నీరు

టేకులపల్లి: తొమ్మిదోమైలు తండా సాయనపేట గ్రామం సమస్యలకు నిలయంగా మారింది. దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారుతున్నా ఈ ఆదివాసీల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. గ్రామంలో సుమారు 30 నివాసాలు ఉండగా 200 జనాభా. ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకు పక్కా రోడ్డు లేదు. గ్రామంలో కొంత మేరకు మాత్రమే సీసీ రోడ్డు ఉంది. అంతర్గత రోడ్లు లేవు. వర్షం వస్తే బురదతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో పాఠశాల లేదు. అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం మాత్రం కొనసాగుతోంది. రెండు చేతి బోర్లు ఉన్నప్పటికీ అవి సక్రమంగా పని చేయడం లేదు.

గ్రామంలో నీటి సరఫరా కోసం మిషన్ భగీరథ మినీ ట్యాంకు నిర్మించారు. వారం, పది రోజులకోసారి ఇష్టారాజ్యంగా నీటిని వదులుతుండటంతో గ్రామస్తులు అవస్థలు పడాల్సి వస్తోంది. బోర్లకు మరమ్మతులు చేయాలని, మిషన్ భగీరథ నీటిని ప్రతీరోజు సరఫరా చేయాలని, గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీ నిర్మించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి సాయనపేటలో సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



సాయనపేట గ్రామంలో రోడ్డు దుస్థితి



పని చేయని చేతిపంపు

రోడ్డు నిర్మాణం చేపట్టాలి..



ప్రధాన రహదారి నుంచి గ్రామానికి, మరియు గ్రామంలో పక్కా రోడ్డు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇదిగో.. అదిగో అంటూ దశాబ్దాలుగా రోడ్డు కోసం ఎదురు చూస్తున్నాం. ఈ రోడ్డు గుండానే కామేపల్లి, కారేపల్లి మండలాల మీదుగా చాలామంది ఖమ్మం వెళ్తుంటారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని గ్రామంలో సమస్యలపై చర్యలు తీసుకోవాలి.

– తోలెం ముత్తయ్య

బోర్లకు మరమ్మతులు చేయించాలి



సాయనపేట గ్రామంలో రెండు బోర్లు ఉంటే అవి సక్రమంగా పని చేయడం లేదు. మిషన్ భగీరథ కోసం మినీ ట్యాంకు ఏర్పాటు చేశారు. నీటి సరఫరాలకు వేళాపాల లేదు. వారం పది రోజులకోసారి ట్యాంకుకు నీటి సరఫరా చేస్తున్నారు. ఇళ్లలో ఉన్న ఒకటి రెండు బోర్ల దగ్గర నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యకు పరిష్కారం చూపాలి.

– ధనసరి నరసింహారావు